
ప్రజాశక్తి
సోమవారం 11 డిసెంబర్ 2023
5
అనంతపురం



మెప్మాలో అవినీతి కంపు



అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ పేదరిక నిర్మూలన విభాగం మెప్మా అవినీతి అక్రమాలకు అడ్డగా మారిందనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది కమ్యూనిటీ ఆర్గనైజర్ల అక్రమాల బాగోతం అక్టోబర్‌లో జరిగిన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో పలువురు కార్పొరేటర్లు బహిర్గతం చేశారు. పొదుపు సంఘాల్లోని అవకతవకలను సమావేశం సాక్షిగా ఆధారాలతో సహా ప్రస్తావించారు. సమావేశం జరిగి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఈ ఆరోపణలపై ఎలాంటి విచారణ జరగలేదు. అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు ఎదుర్కొంటున్న వారిపై కనీస విచారణ కూడా చేపట్టకపోవడం గమనార్హం.

◆ సంఘాల్లో సిబ్బంది చేతివాటం

◆ సిఒల అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

◆ అవినీతికి వత్తాసు పలుకుతున్న కొందరు అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కార్పొరేషన్ పరిధిలో కొందరు కమ్యూనిటీ ఆర్గనైజర్లు రిసోర్స్ పర్సన్స్‌తో కుమ్మక్కై అవినీతి బాగోతం నడిపించారని కొన్ని పొదుపు సంఘాల సభ్యులు చెబుతున్నారు. గత నెల 16వ తేదీన ఎర్రనేల కొట్టాలలోని ఆశ సమైక్య సంఘంకు సంబంధించి ఆరు లక్షల రూపాయలను కమ్యూనిటీ ఆర్గనైజర్ వైజయంతి, బుక్‌కీపర్ పార్వతి కలిసి 31 గ్రూపుల సొమ్మును స్వాహా చేశారని స్పందనలో కలెక్టర్‌కు బాధితులు వినతిపత్రం సమర్పించారు. ఈ స్వాహా కారణంగా గ్రూపుల్లో తీసుకున్న రునాలకు కంతులు చెల్లించడం కష్టం అవుతోందని, దీని వల్ల అధిక వడ్డీ మీద పడుతోందని వారు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు కలెక్టర్ కార్యాలయం నుంచి డిఆర్‌డిఎ పీడీకి గత నెల 17వ తేదీన విచారణ నిమిత్తం పంపారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఫిర్యాదు కావడంతో డీఆర్డీఏ పీడీ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపారు. దీనిపై విచారణ జరపాలని కార్పొరేషన్‌లోని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి పంపారు. ఇది పంపి 25 రోజులు కావస్తున్నా దీనిపై సిటీ మిషన్ మేనేజర్ విచారణ జరపటం కానీ బాధ్యులపై చర్యకు సిఫార్సు చేయటం కానీ జరగలేదు. రూ.6 లక్షలపై అంశంపై కమ్యూనిటీ ఆర్గనైజర్ వైజయంతి అడిగితే 'దాని సంగతి మీకెందుకు మేం చూసుకుంటాం' అనే సమాధానం ఆమె నుంచి వస్తోంది. అవినీతి ఆరోపణల వ్యవహారం వెనుక బుక్‌కీపర్ పార్వతి, కమ్యూనిటీ ఆర్గనైజర్ మధ్య పెద్ద వ్యవహారమే జరుగుతున్నట్లు తెలుస్తోంది. పది రోజుల క్రితం రజక నగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర గ్రూపు లీడర్ మీనాక్షి కమ్యూనిటీ ఆర్గనైజర్ శిరీష, రిసోర్స్ పర్సన్ పద్మతో కలిసి అవినీతికి పాల్పడ్డారని మేయర్ మహమ్మద్ వసీం దష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కార్పొరేషన్ కార్యదర్శి సంఘం శ్రీనివాసులకు సైతం రిసోర్స్ పర్సన్ పద్మ గ్రూపు సభ్యులతో డిపాజిట్ పేరుతో వసూలు చేయించిన 80 వేల రూపాయలను స్వాహా చేశారని వారికి విన్నవించుకున్నారు. స్వాహా చేసిన సొమ్ములో రూ.40 వేలను రీసోర్స్‌పర్సన్ పద్మ కార్పొరేటర్ శ్రీనివాసులు ద్వారా అకౌంట్‌కు జమ చేసినట్లు సమాచారం. ఇదే అంశాన్ని సదరు కార్పొరేటర్ కౌన్సిల్లో ప్రస్తావించి, దీనిపై చర్యలు చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంకాలమ్మ గ్రూపులో సైతం ఇలాంటి అవినీతి జరిగిందని స్థానిక కార్పొరేటర్ కౌన్సిల్లో ప్రస్తావించారు. వీటిల్లో ఏ ఒక్కదానిపై కూడా మున్సిపల్ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



నాలుగు నెలల క్రితం జరిగిన బదిలీల్లో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కమ్యూనిటీ ఆర్గనైజర్లు లక్ష్మీనారాయణ, నాగపల్లవి, దూద్‌పీరాలు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారు బదిలీపై వచ్చారు. వారికి సంబంధించిన ఆన్లైన్లో ధర్మవరం, గుంతకల్లు, పుట్టపర్తిలో లాగిన్లు ఉన్నాయి. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చిన కళావతి, పార్వతీలకు సంబంధించి కొత్త ఐడీలు క్రియేట్ చేసి లాగిన్లను సిటీ మిషన్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి లాగిన్లు ఇవ్వాల్సి ఉండగా ఈ పని ఇంత వరకు జరగలేదు. లాగిన్ ఐడీలు ఇవ్వకుండా కావాలనే జాప్యం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వారికి సంబంధించి వార్డుల్లో పొదుపు సంఘాలకు రుణాలు ఇప్పించడం తదితర కార్యక్రమాలన్నీ సిటీ మిషన్ మేనేజర్ స్వయంగా జరుపుతున్నారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. కొత్తగా బదిలీపై వచ్చిన వారికి నాలుగు నెలలుగా వార్డుల కేటాయింపు జరగలేదు. లాగిన్ ఐడీలు క్రియేట్ చేయకపోవడం బట్టి చూస్తే సిటీ మిషన్ మేనేజర్ హవా ఏ స్థాయిలో నడుస్తుందో తెలుసుకోవచ్చు. పొదుపు సంఘాల గ్రూపుల్లో సిఒల అక్రమాలపై సిటీ మిషన్ మేనేజర్ దష్టికి సైతం తీసుకెళ్తే సర్దుకుపోవాలని ఉచిత సలహా ఇస్తున్నట్లు తెలుస్తోంది. పొదుపు మహిళలకు న్యాయం చేయకపోగా అవినీతికి వత్తాసు పలికే విధంగా విభాగంలోని కొందరు అధికారులు వ్యవహరించటం శోచనీయమని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విభాగంలోని మరో అధికారి భోగస్ సర్టిఫికెట్లతో మున్సిపల్ కార్పొరేషన్ మెప్మా విభాగంలో నియామకాలకు తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఈ విచారణ పూర్తయితే జిల్లాలోని మెప్మా విభాగంలో పలువురు బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు తెలుస్తుందని ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. ఇలా అవినీతికి కేరాఫ్‌గా మారిన మెప్మా విభాగంపై మున్సిపల్ ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలు బయటకు తేవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉపాధి' చూపకుంటే వలసలే..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో కరువు తీవ్రంగా ఉన్నందున పట్టణ ప్రాంతాల్లోనూ జాతీయ ఉపాధి హామీ పనులను పెట్టాలని లేకుంటే ఈ ప్రాంతాల నుంచి కూడా వలసలు అధికం అవుతాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు సహాయ చర్యలు చేపట్టలేదన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పిల్లల చదువులు ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని పనులు కల్పించలేక పోతే పట్టణ ప్రాంతాల నుంచి వలసలు పెరుగుతాయని తెలిపారు. హమాలీ, ఆటో, భవన నిర్మాణం, ఇంటి పనుల లాంటి రంగాలలో వేలాది పేద కుటుంబాలు జీవిస్తున్నాయని. వీరి జీవితాలను ప్రభుత్వ విధానాలు, కరువు పరిస్థితులు తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని తెలిపారు. అసంఘటిత రంగాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని తెలిపారు. నిర్మాణ రంగంలో కాంట్రాక్టర్లు బయట ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులను తెచ్చుకుని స్థానికులకు పనులు లేకుండా చేస్తున్నారని తెలిపారు. మురికివాడల్లో నివసించే పేదలు కనీస అవసరాలకు కూడా అప్పులపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో పేదలని ఆదుకునేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని డిమాండ్ చేశారు. కేరళ, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు అమలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం అలాంటి చర్యలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర కరువు బృందాలు రాక

◆ 12, 13న ఉమ్మడి జిల్లాలో పర్యటన ◆ మూడు బృందాలుగా పరిశీలనలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర కరువు బృందాలు రెండు రోజుల పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 12, 13వ తేదీల్లో అనంతపురం, సత్యసాయి జిల్లాలో కేంద్ర కరువు బృందాల పర్యటన ఉండనుంది. ఈ మేరకు రెండు జిల్లాల అధికారులకు సమాచారం వచ్చింది. పర్యటన ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి తీవ్ర వర్షాభావ పరిస్థితులు అనంతపురం, సత్యసాయి జిల్లాలో నెలకొంది. ఇప్పటికే అనంతపురం జిల్లాలో 28 మండలాలు, సత్యసాయి జిల్లాలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర కరువు బృందాలు పర్యటించి కరువును అంచనా వేయనున్నాయి.

మూడు బృందాలుగా పుర్యటన

కేంద్ర కరువు బృందానికి కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ నేతృత్వం వహించనున్నారు. ఈయన నాయకత్వంలో వచ్చే కరువు బృందంలో మొత్తం పది మంది సభ్యులు ఉండనున్నారు. ఈ బృందం ఈనెల 11వ తేదీన బెంగళూరుకు చేరుకుంటుంది. ఈనెల 12వ తేదీన అనంతపురంలో మూడు బృందాలు పర్యటించనున్నాయి. ఆ తరువాత 13వతేదీన సత్యసాయి జిల్లాలో ఒక బృందం పర్యటించనుంది.

మొదటి రోజు అంటే ఈనెల 12వ తేదిన మూడు బృందాలు అనంతలో పర్యటన

టీమ్-1 : ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం చేరుకుంటారు. అక్కడ గంటపాటు కలెక్టర్ ఇచ్చే నివేదికను పరిశీలిస్తారు. ఉదయం 11.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనంతపురం రూరల్ మండలంలోని కామారుపల్లి, కురుగుంట గ్రామాల్లో వేరుశనగ, ఆముదం, కంది పంటలను పరిశీలిస్తారు. అనంతరం మధ్యాహ్నం కురుగంటలోనే భోజన విరామం తరువాత పామిడి మండలంలో ఎద్దులపల్లి, అనుంపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరిశీలిస్తారు. అక్కడితో మొదటి రోజు పరిశీలన పూర్తవుతుంది.

టీమ్-2 : కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం రెండో బృందం రాయదుర్గం మండలం ఆవులదట్ల, జుంజురాంపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంటలోపు పరిశీలిస్తారు. మధ్యాహ్న విరామం తరువాత మధ్యాహ్నం మూడు గంటల నుంచి కళ్యాణదుర్గం మండలంలోని చాపిరి, గరుడంపల్లి గ్రామాల్లో రెండో బృందం పర్యటిస్తుంది.

టీమ్-3 :ఉదయం కలెక్టరేట్‌లో సమాదేశం అనంతరం 11.30గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఉరవకొండ మండలంలో పర్యటిస్తారు. ఆమిద్యాల, రాకెట్ల గ్రామాల్లో కేంద్ర కరువు బృందం పర్యటిస్తుంది. భోజన విరామం తరువాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆత్మకూరు మండలంలోని తలుపూరు, తోపుదుర్తి గ్రామాల్లో పర్యటిస్తుంది.

రెండవ రోజు సత్యసాయి జిల్లాలో ఒకే బృందం పర్యటన

ఈనెల 13వ తేదీన సత్యసాయి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటిస్తుంది. ఉదయం అనంతపురం నుంచి బయలుదేరి 11.30 గంటలకు పరిగి మండలం చేరుకుంటుంది. ఆ మండలంలోని మోద, యర్రగుంట్ల గ్రామాల్లో పర్యటించి మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలిస్తుంది. 11.45 గంటల నుంచి మధ్యాహ్నం భోజన విరామం లోపు మడకశిర మండలంలోని హరేసముద్రం, కదిరేపల్లి గ్రామాల్లో పర్యటిస్తుంది. భోజనం తరువాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల్లోపు గుడిబండ మండలంలోని గుడిబండ, మందలపల్లి గ్రామాల్లో పర్యటిస్తుంది. అనంతరం మూడున్నర గంటలకు అమరాపురం మండలం చేరుకుంటుంది. అక్కడ వలస గ్రామంలో పంటలను పరిశీలించి రాత్రికి అనంతపురం చేరుకుంటుంది.

ఆదిమరిస్తే మృత్యువాత

పుట్లూరులో ప్రమాదకరంగా బ్రిడ్జి - భయాందోళనలో విద్యార్థులు, ప్రజలు

ప్రజాశక్తి-పుట్లూరు

ఈ బ్రిడ్జిపై వెళ్లేటప్పుడు ఏమాత్రం ఆదమరిచినా మృత్యువాత పడాల్సిందే.. మండల కేంద్రంలోని హెచ్‌ఎల్‌సి కాలువపై ఏర్పాటు చేసిన రెండు బిడ్జిలకు ఇరువైపులా ఉన్న సైడ్‌వాల్స్ కూలిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో బ్రిడ్జిలపై ప్రయాణించాలంటే వాహనచోదకులు, విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. గతంలో నాయకునిపల్లె వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై వెళ్తూ ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కాలువలో పడి మృతిచెందారు. మరోవైపు బ్రిడ్జిపై కస్తూరిబా బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా ఆదర్శ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ బ్రిడ్జికి సైతం సైడ్ వాల్స్ లేకపోవడంతో గతంలో కాలువలోకి ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు పడిన ఘటనలూ ఉన్నాయి. దీంతో ఆస్తి నష్టం కూడా జరిగింది. అయితే ప్రాణ నష్టం జరగలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుముందే మేల్కొని బ్రిడ్జికి ఇరువైపులా సైడ్‌వాల్స్‌లు కట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



పుట్లూరులో ప్రమాదకరంగా బ్రిడ్జి

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

మున్సిపల్ కార్మిక సంఘం, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పోరాటాలు చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని మున్సిపల్ కార్మిక సంఘం, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై సమన్వయ కమిటీలు కలిసి పోరాడాలన్నారు. కలిసి పోరాడితే తప్ప హక్కులను సాధించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ, పంచాయతీ కార్మికులకు చాలీచాలని జీతాలతో ఇస్తున్నారన్నారు. సమాన పనికి, సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను మారుస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఈ సమయంలో ఆయా సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే ఏకైక మార్గం అన్నారు. కావున రానున్న రోజుల్లో అన్ని ప్రజాసంఘాలు కలిసి పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా సి.నాగేంద్ర, కో కన్వీనర్లుగా కాత్యాయిని, సుబ్రమణ్యం, నారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల నాయకులు సంజీవరెడ్డి, హమాలీ యూనియన్ నాయకులు రుద్రప్ప, సిఐటియు మండల సహాయ కార్యదర్శి నెట్టికల్లు, వ్యవసాయ సంఘం నాయకులు పుల్లయ్య, హరి, భవన నిర్మాణ కార్మికులు వేణుగోపాల్, పంచాయతీ కార్మికులు కొండన్న, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం

చేనేతలకు ప్రభుత్వ పథకాలను అందిస్తాం

◆కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

◆జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి రాచపూటి రమేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



రాచపూటి రమేష్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను చేనేత కార్మికులందరికీ అందిస్తున్నామని, వీటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి రాచపూటి రమేష్ తెలిపారు. 'వ్యవసాయం తర్వాత చేనేతలు అత్యధికమంది మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ప్రధానంగా గిట్టుబాటు ధరలు లేక చేనేత రంగం సంక్షోభంలో ఉంది. జిల్లాలో ఈ వృత్తిపై దాదాపు 25 వేల మంది జీవిస్తున్నారు. వారికి గిట్టుబాటు ధరలు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది' అని చేనేత జౌళిశాఖ జిల్లా ఎడి రాచపూటి రమేష్ తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని మగ్గాలు ఉన్నాయి? ఎక్కడ ఎక్కడ ఉన్నాయి.?

ఎడి : సత్యసాయి జిల్లాలో దాదాపు 25 వేల మగ్గాలు ఉన్నాయి. ప్రధానంగా ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లి, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి.

ప్రశ్న: చేనేతలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న పథకాలు? వాటి వివరాలు ఏమిటి.?

ఎడి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ముద్రా రుణాలు 1710 మందికి రావాల్సి ఉండగా నవంబర్ వరకు 475 మందికి వచ్చాయి. దాదాపు రూ.533 లక్షలు మంజూరు అయ్యింది. మిగతా వారికి త్వరలో మంజూరు కానున్నాయి. 1213 చేనేత రుణాల కోసం ప్రతిపాదనలు పంపాం. చేనేత పింఛన్లు పాతవి 15,509 మందికి వస్తుండగా కొత్తవి మరో 1200 మందికి ప్రతిపాదించాం. ఒక్కొక్కరికి 2750 రూపాయలు నెలకు పింఛను వస్తుంది. 57 ఏళ్ల వయసు దాటిన వారికి ఈ పింఛన్లు మంజూరు చేస్తాం. నేతన్న నేస్తం కింద ఒక్కొక్కరికి రూ.24వేలు చొప్పున 15500 మందికి రుణాలు నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తున్నాం. మగ్గము పెట్టు ఉన్నవారికి స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకున్నవారికి రుణ సదుపాయం కల్పిస్తున్నాం. 316 మందికి జాకార్డు మగ్గాలు ఇతర పనిముట్లు లిఫ్టింగ్ మిషన్ అందించాం. లిఫ్టింగ్ మిషన్ వల్ల కాలుతో తొక్కకుండా సులభంగా మగ్గం నేయడానికి సదుపాయం ఉంది. ఈ పనిముట్లకు 15 శాతం సబ్సిడీ ఉంటుంది. ఇప్పటికి 83 మంది ఎస్సీ చేనేతలకు వీటిని పంపిణీ చేశాం. ఈ స్వయం సహాయక సంఘాలలో 10 మంది సభ్యులుగా ఉంటారు.



ప్రశ్న:చేనేత వస్త్రాలకు ప్రభుత్వపరంగా చేయూతనిస్తున్న మార్కెట్ సదుపాయాలు ఏమిటి..?

ఎడి : చేనేతలు తయారు చేసిన వస్త్రాలను పలు ఎగ్జిబిషన్లలో ప్రదర్శిస్తున్నాం. కార్మికులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం వాటి ఖర్చును భరిస్తోంది. దీంతో ఆ వస్త్రాలకు ప్రచారం కూడా జరుగుతుంది. ఆప్కో ద్వారా ఇప్పటికే అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ధర్మవరంలో కూడా ఈ అమ్మకాలు చేయడానికి అవకాశం ఉంది. మరిన్ని ఆప్కో కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉంది. దానికి తగిన ప్రతిపాదనలు పంపాం. టెక్స్‌టైల్ టెక్నాలజీ కేంద్రం మడకశిరలో ఉంది. ఈ టెక్నాలజీ వల్ల కొత్త డిజైన్ చేసుకోవచ్చు. ఇతర కంపెనీలలో కూడా ఉద్యోగ అవకాశాలు చేసుకోవడానికి వీలుంటుంది. పదవ తరగతి ఆపైన చదువుకున్న వారు ఈ టెక్నాలజీ కేంద్రంలో మూడున్నర సంవత్సరం కోర్సులో చేరాల్సి ఉంటుంది. అలా శిక్షణ పొందిన వారు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. సోమందేపల్లి కేంద్రంలో 40 రోజులు శిక్షణ కొత్త డిజైన్ నేర్చుకోవడానికి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందులో శిక్షణ పొందే వారికి స్టయిఫండ్ కూడా ఇస్తారు.

ప్రశ్న:మగ్గాలపై ప్రభుత్వపరంగా ఎలాంటి పర్యవేక్షణ ఉంటుంది?

ఎడి : జిల్లాలో వివిధ సొసైటీలు పర్యవేక్షణకు 12 మంది పర్సనల్ ఇన్‌ఛార్జులు ఉన్నారు. వారు మగ్గాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మరో 6 మంది జౌళి శాఖ చేనేత ఏడీలు ఉంటారు. వారు కూడా పర్యవేక్షిస్తుంటారు. ధర్మవరం చేనేత వస్త్రాలకు ప్రపంచ ఖ్యాతి గడిచింది. అందుకు కేంద్ర ప్రభుత్వం అవార్డు కూడా వచ్చింది. ఈ అవార్డు ఉమ్మడి జిల్లాలకు దక్కింది. ప్రస్తుతం మరో అవార్డు కోసం ప్రతిపాదనలు పంపాం.

ప్రశ్న: మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.? చేనేతలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి.?

ఎడి : నూతన సత్యసాయి జిల్లాలో 11 మంది ఏడీలు ఉండాల్సి ఉండగా 6 మంది ఉన్నారు. కార్యాలయం మున్సిపాలిటీ పరిధిలో పట్టణానికి దూరంగా ఉన్నందున పలువురు చేనేతలు కార్యాలయాలకు రాలేకపోతున్నారు. పట్టణంలోనే సరైన ప్రదేశాన్ని ఎంపిక చేసి కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. వాహన సౌకర్యం లేకపోవడంతో జిల్లా అంతటా సిబ్బంది బస్సులలో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో వ్యయప్రయాసాలకు లోనవుతున్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలి. చేనేత కార్మికులు చాలామంది మైక్రో ఫైనాన్స్ కార్పొరేషన్‌లలో అప్పులు చేస్తున్నారు. దీంతో వడ్డీలు పెరిగిపోయి ఇబ్బందులు పాలవుతున్నారు. అర్హత ఉన్నవారికి తమ శాఖ ద్వారా రుణాలు పొందవచ్చు. చేనేతలు ఎవరూ మైక్రో ఫైనాన్స్ వలలో చిక్కుకోవద్దని సూచిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా వి.కోటేశ్వరప్ప

కార్యవర్గ సభ్యురాలిగా దేవేంద్రమ్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



వి.కోటేశ్వరప్ప




దేవేంద్రమ్మ

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన వి.కోటేశ్వరప్ప 3వసారి ఎన్నికయ్యారు. ఏలూరులోని చలసాని గార్డెన్స్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన వి.కోటేశ్వరప్పతోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా ఎన్.దేవేంద్రమ్మ ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపై యుటిఎఫ్ జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప మాట్లాడుతూ రాబోయే కాలంలో నూతన విద్యావిధానం-2020 రద్దు, 117 జిఓ రద్దు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిరక్షణ కోసం తల్లిదండ్రులతో ప్రజా సంఘాలతో, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. సిపిఎస్, జిపిఎస్ రద్దు కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు. యాప్ రద్దు కోసం, ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, సహాధ్యక్షురాలు సరళ, జిల్లా కార్యదర్శి సంజీవులు, రఘురామయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

పోస్టర్లు ఆవిష్కరించిన ఎపి రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 15, 16, 17వ తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి తెలిపారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో కౌన్సిల్ సమావేశాల గోడపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నూలులో 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే కిసాన్ సభా కౌన్సిల్ సమావేశాలకు 15న రైతుల మహా ప్రదర్శన బహిరంగ సభ ఏర్పాటు చేయన్నుట్లు తెలిపారు. బహిరంగ సభకు ఏకేస్ జాతీయ అధ్యక్షులు అశోక్ దావలె, ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, కర్నూలు మాజీ ఎమ్మెల్యే గఫూర్, జాతీయ ఉపాధ్యక్షులు టి.సాగర్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కష్ణయ్య, కే.ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. కావున ఈ బహిరంగ సభకు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పంటలకు మద్దతు ధరలు చట్టం సమగ్ర పంటల భీమా సాగునీటి ప్రాజెక్టులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యుత్తు సంస్కరణలు ద్వారా రైతాంగంపై వేసే బారాలపై అఖిల భారత సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వ పాలనలో రైతుల అప్పుల పాలు అవుతున్నారని, సగటున ప్రతి రైతు కుటుంబానికీ రూ.2.54 లక్షల రుణభారం పడిందన్నారు. రైతులకు సంబంధించిన అన్ని రకాల రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. రాయలసీమలో ఖరీఫ్ రబీ సీజన్‌లో తీవ్రమైన కరువు ఏర్పడిన దృశ్యా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా నాయకులు వి.రామిరెడ్డి, రైతుసంఘం నాయకులు వన్నూరప్ప, శ్రీనివాసులు, పుల్లన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో చదువుకోవడం వరం

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి



ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

ప్రజాశక్తి-శింగనమల

గురుకుల పాఠశాలలో చదువుకోవడం విద్యార్థులకు ఓ వరం అని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా గ్యారంపల్లి గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివారెడ్డి పాఠశాల 40 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలు మంచి చదువుతోపాటు క్రమశిక్షణ, సాంఘిక జీవనం, సామాజిక స్పృహను నేర్పిస్తాయన్నారు. సిఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తయారుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎజిఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ సొలమాన్‌రాజు, కియా మోటార్స్ సలహాదారు సోమశేఖర్‌రెడ్డి, పూర్వ విద్యార్థి, ఎన్నారై హరి సింగం, తిరుపతికి చెందిన ఆడిట్ అధికారి మోహన్‌రెడ్డి, గురుకుల పాఠశాలల సొసైటీ కన్వీనర్ వెంకట నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు వడ్డీ రహిత రుణాలు మంజూరు



రుణాల చెక్కు అందజేస్తున్న సొసైటీ మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు హాజీపీరా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇస్లామిక్ ఖిద్మత్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని చిరు వ్యాపారులకు వడ్డీ రహిత రుణాలు మంజూరు చేసినట్లు ఆ బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు హాజీపీరా తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రూ. 50 లక్షల వరకు వడ్డీ రహిత రుణాలు చిరు వ్యాపారులకు అందజేశామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఇస్లామిక్ బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేసుకోవాలన్నారు. సెల్.. 83092 95739, 83318 47823 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, మేనేజర్ ఎజాజ్, సభ్యులు ఫిరోజ్, హుస్సేన్ పాల్గొన్నారు.

నీటి ట్యాంకులు ప్రారంభం



నీటిట్యాంకును ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నాలుగు నీటి ట్యాంకులను విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. 12వ వార్డు చర్చి సమీపంలో, 17వ వార్డు గుగ్గిరట్టి ప్రాంతంలో, 19వ వార్డు మలకల్మూరు రోడ్డులో, 20వ వార్డు పైతోటలో నిర్మించిన వాటర్ ట్యాంకులకు పూజ చేసి ప్రారంభించారు. అలాగే పట్టణంలోని 10వ వార్డు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం సమీపంలో 14వ ఆర్థికసంఘం నిధులతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు బండి అజయ్, సబిరా, శారద, సంజీవప్ప, గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, ప్రతాప్, ఫక్రుద్దీన్, హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌ఛార్జి పొరాలు శివ, దివాకర్, ఏటూరి మహేష్, రామాంజనేయులు, నిజాముద్దీన్, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కాంట్రాక్టర్ కాంతారెడ్డి, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నం బాధాకరం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని జిల్లాలోని పాల్తూరు పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు బోయ మల్లేశప్ప ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమని ఎపి రాష్ట్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన వారంలోపు సీపీఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరణ చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. ప్రస్తుతం గ్యారెంటీడ్ పెన్షన్‌ను అమలు చేయడం ఉద్యోగులను మోసం చేయడమే అని విమర్శించారు. ఈనేపథ్యంలో సిపిఎస్ రద్దు చేయకపోవడం, ప్రతినెలా 1వతేదీన జీతాలు రాకపోవడంతో మనస్థాపం చెందిన ఉపాధ్యాయుడు మల్లేశప్ప ఐదు పేజీల ఉత్తరం సిఎం జగన్‌కు రాసి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి సిపిఎస్‌ను రద్దు చేయడంతోపాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుల పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, ప్రాథమిక పాఠశాలల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆయా పాఠశాలలో మండల కేంద్రంలోని గూగూడు రోడ్డుకి ఆనుకుని ఉన్నాయి. ఈ రోడ్డులో నిత్యం బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు అతివేగంగా తిరుగుతుంటాయి. ఇలాంటి రహదారిలో ఉన్న పాఠశాలలకు వెళ్లేటప్పుడు, పాఠశాలలు వదిలినప్పుడు విద్యార్థులు గుంపులు, గుంపులుగా వస్తూ, వెళ్తూ ఉంటారు. ఇలాంటి సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కూడా పాఠశాలల ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చినా ఇంతవరకూ ఎవరు స్పందించలేదనిని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా పాఠశాలల ముందు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన



పెద్దమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం : మండలంలోని పసలూరు ఎస్సీ కాలనీలో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామంలో సుమారు 50ఏళ్ల పైబడి నుంచి పెద్దమ్మ ఆలయం ఉంది. కాలక్రమేనా ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో స్థానికులు దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా 41 రోజులపాటు పూజలు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు నడిపి పెద్దన్న, రామకృష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సిపి పెద్దన్న, వెంకటరాముడు, సి.పెద్దన్న, ఎం.పెద్దన్న, చింతమాను సి.తిక్కయ్య, పెద్దన్న, చెక్క నారాయణస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదాస జయంతి



కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తున్న కురుబలు

బెలుగుప్ప : మండల కేంద్రంలో కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంతిని ఆదివారం కంబల్ల సొసైటీలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కనదాస చిత్రపటాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. ఊరేగింపు ముందు గొరవయ్యల నృత్యాలు, డప్పు కళాకారులు అలరించారు. ఈ కార్యక్రమంలో కనకదాస కమిటీ సభ్యులు, మహిళలు, చిన్నపిల్లలు పాల్గొన్నారు

ప్రజల కోసం పనిచేసే వారినే ఎన్నుకోవాలి

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే నాయకులనే రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో టైలర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ మంచి కోసం కృషి చేస్తానన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో 13500 రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇంటి పట్టాలు, అందించామన్నారు. పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో రూ.150 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించామన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలనే లక్ష్యంతో 6 వేల టిడ్కో ఇల్లు 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన 10 శాతం వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. నాలుగు నెలల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని రాగానే ఉన్న 6వేల ఇళ్లతో పాటు, మరో ఆరు వేల నిర్మాణం పూర్తి చేసి పేదలందరికీ నివాస గహాలు అందిస్తామన్నారు. గతంలో దాదాపు 2 వేల మంది మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరిన్ని సంక్షేమ పథకాలు టైలర్స్‌కు ప్రవేశపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీ నరసింహులు, ఈటె స్వామిదాసు, జేయం బాషా, పూల బాషా, ముత్యాలు, టైలర్స్ సంఘం అసోసియేషన్ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

ప్రభాకర్‌చౌదరిని కలిసిన సినీనటుడు నాగినీడు



ప్రభాకర్‌చౌదరికి పుస్తకాన్ని అందజేస్తున్న సినీనటుడు నాగినీడు

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని సినీనటుడు నాగినీడు ఆదివారం అర్బన్ పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి తాను రచించిన అవినీతి, ఫ్యాక్షనిజం, పుస్తకాలను సినీ నటుడు నాగినీడుకు అందించారు.

భారత్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎక్స్‌పో ప్రారంభం

నిర్వాహకులు ఫక్రుద్దీన్



హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో భారత్ ఎగ్జిబిషన్, నిర్వాహకులు ఫక్రుద్దీన్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న మైదానంలో హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో భారత్ ఎగ్జిబిషన్ కం సేల్ ప్రారంభమైనట్లు నిర్వాహకులు ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో నవంబర్ 26 నుంచి భారత్ అడ్మిషన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో సూరత్ వారి క్లియరెన్స్ సేల్స్ మూడు చీరలు రూ.499 అందిస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9:30 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని ఫక్రుద్దీన్ తెలిపారు. అలాగే ప్రతి డెబిట్, క్రెడిట్ కార్డు కొనుగోలుపై 10 శాతం అదనపు డిస్కౌంట్ అందిస్తున్నట్లు చెప్పారు. ఎగ్జిబిషన్‌లో విశిష్టమైన కలెక్షన్స్, జ్యువెలరీ, రాజస్థానీ చెప్పులు, బనారస్ చీరలు, పెయింటింగ్స్, బాందినీ చీరలు, లక్నో ఎంబ్రాయిడరీ, కుర్తాలు, కార్పెట్లు, ముత్యాలు, వెస్ట్ బెంగాల్ కంతా చీరలు, బెడ్‌షీట్స్, కాశ్మీర్ డ్రెస్ మెటీరియల్, బాగల్ పోలీసులు, డ్రెస్ మెటీరియల్, రాజస్థానీ గాజులు, ఎర్రకోట ఉడెన్, ఫర్నిచర్ వంటి వెరైటీలను ఒకే ప్రదేశంలో భారత దేశంలోని చేనేత హస్త కళాకారుల తయారు చేసిన ప్రదర్శన, అమ్మకానికి ఉంచబడినట్లు తెలిపారు. జనవరి 28వ తేదీ వరకూ భారత్ ఎగ్జిబిషన్ అనంతపురం ప్రజలకు అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి అరాచక పాలనపై తిరుగుబాటు

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పామిడి

వైసిపి అరాచక పాలనపై ప్రతి ఒక్కరూ తిరగబడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కొండాపురం గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైఇసపి పాలనలో దోపిడీలు, అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. దందాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ఏ ప్రాంతంలో చూసినా వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చీదరించుకునే స్థాయికి వెళ్లారన్నారు. ఈనేపథ్యంలో మనమందరం సమిష్టిగా పోరాటం చేస్తూ వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడి, టిడిపి అధినేత చంద్రబాబును సిఎంను చేసుకుందాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పామిడి మండల కన్వీనర్ ముసలిరెడ్డి, మాజీ ఎంపిటిసి బాలరాజు, నాయకులు మధుసూదన్, భాస్కర్, జయకుమార్, సునీల్, సురేష్, సునీల్, చంద్ర, సూర్యనారాయణ, మధు, శ్రీరాములు, పెద్దిరెడ్డి, సుంకన్న, ఓబులేష్, రామాంజనేయులు, భాస్కర్, రంగారెడ్డి, బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో నార్పల జట్టు విజయం



క్రికెట్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన బ్యాట్స్‌మెన్, బౌలర్లు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీల్లో నార్పల జట్టు విజయం సాధించింది. ఆర్డీటి, ఏడీసీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న అండర్-15 (ఎపిఎల్) సూపర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ గుత్తి,నార్పల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన నార్పల ఆర్డీటీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నార్పల జట్టులోని క్రీడాకారుడు సి.చిరంజీవి 146 బంతుల్లో 108 పరుగులు చేయడంతో 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన గుత్తి ఆర్డీటీ జట్టు 28.4 ఓవర్లలో 111 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. గుత్తి జట్టు కెప్టెన్ భువనేశ్వర్ 87 బంతుల్లో (7 ఫోర్లతో) 58 పరుగులు చేశాడు. నార్పల జట్టులోని కె.సంజయ్ 7.4 ఓవర్లలో 27 పరుగులు ఇచ్చి 5 వికెట్లు, మరో బౌలర్ తోట భరత్ 9 ఓవర్లలో 34 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసి నార్పల జట్టు గెలుపులో భాగస్వాములయ్యారు.

పెడదారి పడుతున్న యువత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుతం యువత సినిమాలు, వెబ్ సిరీస్ ద్వారా పెడదారి పడుతోందని పలువురు ముస్లిం మత పెద్దలు అభిప్రాయపడ్డారు. తెహరీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ వారి14వ వార్షిక సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సున్ని ఇజ్‌తెమా కార్యక్రమం ఆదివారం ఘనంగా ముగిశాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభించిన కార్యక్ర మంలో భూసావల్ నుంచి సయ్యద్ అబ్దుల్ హబీబ్ సాహెబ్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. తల్లితండ్రుల పట్ల సద్భావంతో మలుసుకోవాలని ఖురాన్ చెబుతోందన్నారు. దయార్ధ మృదయంతో వినయంతో మెలగాలన్నారు.

కర్ణాటక నుంచి వచ్చిన నాసిర్ రజాఖాన్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత సినిమాలు, వెబ్ సిరీస్ ద్వారా చాలా పెడదారి పడుతున్నారని సమాజానికి మంచిది కాదన్నారు. తెహరీక్ అధ్యక్షులు హసన్ రాజా ఖాద్రీ మాట్లాడుతూ స్త్రీలకు సమాన హక్కులు అందాలన్నారు. పాలస్తీనాలో మారణకాండ ఆపాలన్నారు. ప్రముఖ న్యూరో ఫిజిషియన్ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ ముతవల్లి ఫరీదుద్దీన్, సెక్రటరీ పర్వీష్, ట్రెజరర్ షబ్బీర్ అహమ్మద్, హబీబ్, డాక్టర్ షఫీ, ఆరీఫ్, అబ్దుల్‌షమీ, చాంద్‌బాషా, మహబూబ్‌బాషా, హుస్సేన్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు 'జీవనజ్యోతి' విద్యార్థి

ధర్మవరం టౌన్ : గత నెల ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 హాకీ పోటీలలో పాల్గొన్న పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్. పజులుద్దీన్ ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం. సిస్టర్ ఝాన్సీయా తెలిపారు. ఫజులుద్దీన్ ఈనెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో జరిగే ఎస్‌జిఎఫ్ అండర్ -14 రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కలెక్టరేట్ లో స్పందన

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి కలెక్టరేట్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం యథాతథంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల అయింది. ప్రతి వారం నిర్వహించే జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిలో కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వారి వారి సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీ, ఆధార్ కార్డు నకలు, ఫోన్ నెంబర్ అందజేయాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొడవలకు దూరంగా ఉండండి

బత్తలపల్లి : రాబోయే ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూసుకోవాలని గొడవలకు దూరంగా ఉండాలని ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం తెల్లవారుజామున మండలంలోని ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. మద్యం, గుట్కా అమ్మేవారి ఇళ్లుతనిఖీలు చేశారు. సూరీ అనే వ్యక్తి ఇంట్లో ఉన్న 10 కర్నాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రౌడీ షీటర్ల ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించి వారికి కౌన్సిలింగ్ చేశారు. ఆనంతరం గ్రామస్తులతో సమావేశమై పలు సూచనలు. సలహాలు అందించారు.

నేరాలు ఘోరాలు

పొలం వివాదం... రైతు ఆత్మహత్య...



మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

గుత్తి : తన సాగుభూమికి ఉన్న దారి వివాదంతో మనస్థాపానికి గురైన ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం రాంపురం గ్రామానికి చెందిన ఆదినారాయణ కుమారుడు రామచంద్ర (26)కు తన సమీప బంధువులకు భూమి వద్ద దారి కోసం మూడు రోజులుగా గొడవ జరుగుతోంది. సమస్య పరిష్కారం కాకపోవటంతో మానసికంగా కుంగిపోయిన రామచంద్ర గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామ శివారులోకి వచ్చి పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. వెంటనే వచ్చిన వారు అపస్మారక స్థితిలో ఉన్న రామచంద్రను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి ఆత్మహత్య

పుట్టపర్తి రూరల్: ఉదయాన్నే నిద్ర లేవకపోవడంతో తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి వినయ్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుట్టపర్తి మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన నాగరాజు కల్పన ఆదివారం పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే వారి కుమారుడు వినయ్ నిద్ర లేవకపోవటంతో ఉదయాన్నే నిద్రలేవాలని మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన వినయ్ తన తల్లిదండ్రులు ఇంటి నుండి వెళ్లిన అనంతరం ఇంట్లోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వినయ్ సోదరుడు తల్లిదండ్రులకు సమాచారమందించాడు. మృతుడు వినయ్ పెడపల్లి ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. సంఘటన స్థలాన్ని పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

లేపాక్షి : మండలం పరిధిలోని మనేంపల్లి గ్రామ శివార్లలో ఉన్న ఓబుళాపురం చెరువు వద్ద పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. లేపాక్షి, హిందూపురం మండలాలతో పాటు కర్నాటకకు చెందిన బాగేపల్లి, గౌరీబిందనూరు, చిత్రదుర్గ, తుంకూరు తదితర ప్రాంతాల వారు 28 మంది జూదం ఆడుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 21 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 3. 05 లక్షలు, 20 సెల్ ఫోన్‌లు, 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారైన వారిని త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ గోపీ తెలిపారు.

చెక్కభజన గురువుకు జాతీయ నంది పురస్కారం



కుళ్లాయప్పకు పురస్కారం అందజేస్తున్న అతిథులు

శింగనమల : మండలంలోని చిన్న జలాలపురానికి చెందిన బి.కుళ్లాయప్పను తెలుగు వెలుగు సాహితీ నంది పురస్కారం వరించింది. ఈమేరకు శ్రీకృష్ణదేవరాయ కళాక్షేత్రంలో నిర్వహించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక, స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుళ్లాయప్ప మాట్లాడుతూ నంది పురస్కారం తనను వరించినందుకు సంతోషంగా ఉందన్నారు. అవార్డు స్ఫూర్తితో మరింత ముందుకు వెళ్తామన్నారు. అవార్డు అందజేసిన వారిలో తెలుగు వెలుగు సాహితీ జాతీయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ బ్రహ్మశ్రీ పోలోజ్ రాజ్‌కుమార్, సంస్థ జాతీయ కన్వీనర్ రంగిశెట్టి రమేష్, సుబ్రమణ్యం, జమ్ము కాశ్మీర్ పంతులు వెంకటేశ్వర్లు, కోదండరామ చెక్కభజన వ్యవస్థాపకులు మేకల కుళ్లాయప్ప, రాఘవ, బండారు నగేష్, తదితరులు పాల్గొన్నారు.

మతవిద్వేషాలతో అనర్థం

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని నక్కనదొడ్డి గ్రామంలో ఆదివారం ఇస్తేమా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తలు ఉమర్ ఫరూక్, అబ్దుల్ రజాక్, మహమ్మద్‌ఖాసీం, మహబూబ్‌బాషా మాట్లాడుతూ ప్రపంచ శాంతి ప్రధానమే తప్ప మతం ద్వేషం ఉండకూడదన్నారు. ఈ ప్రపంచంలో మనుషులందరూ సమానమే అన్నారు. ఈ కార్యక్రమానికి బళ్లారి, కడప, పత్తికొండ, హుస్సేన్ పురం గుంతకల్లు నుంచి భారీగా ముస్లిములు తరలివచ్చారు.

డేగల కృష్ణమూర్తికి సన్మానం



డేగల కృష్ణమూర్తిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

శింగనమల : రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నికైన డేగల కృష్ణమూర్తిని ఆదివారం అనంతపురంలోని నివాసంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, సెల్ జిల్లా అధికార ప్రతినిధి అరుగుల రాజు, కొర్రపాడు యుగంధర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నరేంద్రకుమార్‌యాదవ్, బీసీ సెల్ కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, తెలుగు యువత జిల్లా కార్యదర్శి వడ్డే రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం బెంగళూరు'ని జయప్రదం చేద్దాం

వైసిపి ఐటి వింగ్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసిపి ఐటి వింగ్ నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : వైసిపి ఐటి వింగ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 21వ తేదిన బెంగళూరులో సర్జాపూర్ స్టేడియంలో ఆడుదాం బెంగళూరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి ఐటి వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆడుదాం బెంగళూరు గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఐటీ వింగ్ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా బెంగళూరు క్రికెట్ పోటీలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు. ఆడుదాం ఆంధ్రాకు అనుబంధంగా ఆడుదాం బెంగళూరు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఐటీ వింగ్ నాయకులు ప్రతాప్, ముకుందాపురం బ్రహ్మ, మురళీధర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సుబ్బురాయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మనిషీ బాధ్యతగా మెలగాలి

కొత్తచెరువు రూరల్ : ప్రతి మనిషి బాధ్యతగా మెలగాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చరల్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిసెంబరు 10వ తేదీని అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయుడు మాట్లాడుతూ భూమి మీద సమస్త జీవరాసులకు మనలాగే హక్కులు ఉంటాయని గుర్తించాలన్నారు.